పేదల ఇంటి ముంగిటకే వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ప్రియదర్శిని కాలనీలో వైద్య శిబిరానికి స్పందన
- 395 మందికి వైద్యసేవలు



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉరుకూటి చందు తదితరులు



బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: పేదల ముంగిటకే వైద్యసేవలు అందిస్తూ ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. గిరిజా కాలనీ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు)తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందజేస్తున్నామన్నారు. ఆరోగ్య సమస్య ఏదైనా అన్ని వ్యాధులకు ఇక్కడే పరీక్షలు చేసేలా నిపుణులను అందుబాటులో ఉంచారన్నారు. గతంలో వైద్యం ఖరీదైన వ్యవహారమని, పేదలు రోగాల బారిన పడితే ఆరోగ్యాన్ని బాగు చేసుకోవడానికి ఎన్నో కష్టాలు పడేవారన్నారు. కానీ, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన తర్వాత అటువంటి కష్టాలు తొలగిపోయాయన్నారు. పేదల ఇళ్ల ముంగిటకే ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తీసుకువచ్చారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలోనే ఇటువంటి మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికి ఆదర్శమన్నారు. శిబిరంలో మొత్తం 395 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మొత్తం ఐదుగురు వైద్యులు రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జీవనరాణి, వైద్యాధికారి వరలక్ష్మి, ఏపీడీ రాము తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరానికి వచ్చిన వారి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

డాక్టర్లు బాగా పరీక్షించారు



నాకు రోజూ తలనొప్పి ఉంటోంది. కంటి సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. ఎన్నో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లినా ఫలితం లేకపోయింది. ఆ సమయంలో సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి టోకెన్ ఇచ్చి, శిబిరం గురించి చెప్పారు. ఇక్కడి వచ్చి, డాక్టర్లకు నా సమస్య తెలియజేశాను. అవసరమైన అన్ని పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇది మంచి కార్యక్రమం.

– **ఎ.పార్వతి**, గిరిజా కాలనీ, 65వ వార్డు

మాలాంటి వారికి ఎంతో భరోసా



ఈ మధ్య ఆరోగ్యం అసలు బాగాలేదు. తల తిరుగుతోంది, ఒళ్లు ఇసురుతోంది. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. ఎక్కడి వెళ్లాలో తెలియని పరిస్థితి.. ఏ పరీక్ష చేయించుకోవాలన్నా వేలల్లో ఖర్చు. ఆ సమయంలో వలంటీర్ వచ్చి ఆరోగ్య శిబిరానికి రావాలని సూచించడంతో వచ్చాను. వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ఆరోగ్యపరమైన సూచనలు చేశారు.

– **ఎం.అవంతి**, ప్రియదర్శిని కాలనీ, 65వ వార్డు

కంటి పరీక్షలు చేశారు



నేను కొన్నాళ్లుగా కంటి సమస్యలతో సతమతమవుతున్నాను. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేదు. ఇక్కడ ఉచితంగా కళ్ల పరీక్షలు చేస్తారని వలంటీర్ చెప్పడంతో శిబిరానికి వచ్చాను. డాక్టర్లు చక్కగా కంటి పరీక్షలు చేశారు. మంచి సలహాలు, సూచనలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. ఇటువంటి వైద్య శిబిరాలు మాలాంటి వారికి చాలా ఉపయోగకరం.

– **పి.రమణబాబు**, భానోజీకాలనీ, 65వ వార్డు

మా పాఠశాల అద్భుతం

తాము చదివిన పాఠశాల రూపురేఖలు మారి, కార్పొరేట్ లుక్ సంతరించుకోవడంతో లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి అద్భుతమని కొనియాడారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ.. సొంతూరు పండగకు వచ్చిన వారంతా పాఠశాలను చూసి ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో వారు పాఠశాల ప్రగతిపై ప్రశంసల జల్లు కురిపించారు.

- లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థుల హర్షం
- నాడు -నేడులో రూ.65 లక్షలతో పాఠశాల అభివృద్ధి
- దాతల సహకారంతో మరికొన్ని వసతులు



సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్వ విద్యార్థులు

అగనంపూడి: లంకెలపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు గుర్రం శంకరరావు, సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా పాఠశాలు రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు చదువుకోడానికి అనువైన వాతావరణం కల్పించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు వసతులను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



తాము చదువుకున్న పాఠశాల వద్ద లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ కృషి.. దాతల సహకారం

ప్రభుత్వ కృషి, చొరవ వల్లనే పాఠశాలకు అధునాతన వసతులు సమకూరాయని లంకెలపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.65 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అలాగే.. లారస్ ల్యాబ్స్ రూ.28 లక్షలతో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దిందన్నారు. వసుధా ఫార్మా కంపెనీ మరో రూ.20లక్షలతో విద్యుత్ సౌకర్యం, ఆర్‌వో ప్లాంట్ చేయగా, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు సహకారంతో రూ.5లక్షలతో పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులు గదులకు సేఫ్టీ గ్రిల్స్, ఫర్నిచర్, సరస్వతీ దేవి విగ్రహం, మైక్‌సెట్ వంటి సౌకర్యాలు కల్పించారన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు మరిన్ని వసతులు కల్పించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రౌతు అప్పాజీ, గాంధీ తదితరులు మాట్లాడారు.

క్లుప్తంగా

నూతన వస్త్రాలు, పింఛన్ అందజేత



నూతన వస్త్రాలు, పింఛన్ అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, దాతలు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పింఛన్‌దారులకు ప్రతీ నెలా అందించే పింఛన్‌తో పాటు స్థానిక నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో నూతన వస్త్రాలను అందజేశారు. 85వ వార్డు పెదమడకలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 65 మంది పింఛన్‌దారులకు రూ.200 చొప్పున నగదు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజువాక జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మి రామునాయుడు, నాయకులు గవర సోమశేఖర్, దాసరి త్రినాథ్, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: దిబ్బపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 19న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గొడ్డువానిపాలెం, గొందేశి వీధి, కండిపిల్లి వీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, ఉప్పర కాలనీ, గంగవరం బడేవారి వీధి, జాలరిపల్లిపాలెం, ధారకొండ వీధి, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సతివాడమ్మ పరస రేపు



సతివాడమ్మ తల్లి

పెందుర్తి: గొరపల్లిలో కొలువైన ఏడు గ్రామాల ఇలవేల్పు సతివాడమ్మతల్లి పరసను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు ఉంటాయని తెలియజేశారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి సందర్భంగా, మాజీ మంత్రి దివంగత నేత గుడివాడ గురునాథరావు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 68వ వార్డు మిందిలో నిర్వహించిన పోటీలు వారం రోజుల పాటు జరిగాయి. పోటీల్లో విజేతలకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. పోటీల్లో మింది గ్రామానికి చెందిన కింగ్స్ మెన్ ఎలెవెన్స్ ప్రథమ విజేతలుగా నిలవగా ఫన్నీ గైస్ జట్టు ద్వితీయ విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మింది గ్రామ పెద్దలు, కోదండ రామాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు



చిన్నారి విజేతకు బహుమతి ప్రదానం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు రెడ్డితుంగ్లాంలో కోదండ రామాలయ పరసను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా స్టీల్ బిందెలను బహుమతిగా అందించారు. చిన్నారి వేసిన ముగ్గుకు కన్సొలేషన్ బహుమతిగా రెండు బిందెలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల విజేతకు సత్కారం



ధనుష్‌ను సత్కరిస్తున్న జిమ్ నిర్వాహకులు

పెదగంట్యాడ: మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో గంగవరం గ్రామానికి చెందిన ధనుష్ సత్తాచాటాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఈ నెల 14న వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 55 కిలోల లోపు విభాగంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే మెన్స్ ఫిజిక్ పోటీల్లోనూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బంగారు పతకాలు సాధించాడు. ధనుష్‌ను స్వామి ఫిట్‌నెస్ జిమ్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. పీత గురుమూర్తి, జి.తాతారావు, దుర్గారావు, రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని ఎన్‌జేసీఎస్ సభ్యులు, హెచ్ఎంఎస్ స్టీల్, మెటల్, ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ వాడకర్ కోరారు. ఈ మేరకు ఆయన స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు లేఖ రాశారు. ఎన్‌జేసీఎస్ ఒప్పందం మేరకు సెయిల్‌లో అన్ని ప్లాంట్లలో కార్మికులకు నూతన వేతనాలు అమలు జరిగాయన్నారు. అయితే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకుని, వారికి నూతన వేతనాలు అమలు చేయాలని కోరారు.

ఉక్కు కార్మికులదే ఆ ఘనత



దీక్షలో పాల్గొన్న అగనంపూడి పోరాట కమిటీ మహిళలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ఘనత కార్మికులదేనని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. దేశంలోని ఏ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1070వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులతో పాటు అగనంపూడి పోరాట కమిటీ మహిళలు పాల్గొని ఉక్కు దీక్షకు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఐక్యంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అగనంపూడి పోరాట కమిటీ మహిళలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తేవాలి’

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు స్థానిక ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ నాయకులు తమ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మె నోటీసు ద్వారా యాజమాన్యానికి హెచ్చరిక పంపారన్నారు. దీనిలో విశాఖ స్టీల్ కార్మికుల నూతన వేతనాల అమలు డిమాండ్ అంశం ఉందన్నారు. ఈ నెల 20న జరగనున్న ఎన్‌జేసీఎస్ సమావేశంలో ఒత్తిడి చేయాల్సి ఉందన్నారు. ఈ అంశంపై సెయిల్ యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని తమ జాతీయ నాయకత్వాన్ని అడిగామన్నారు. ఈ విధమైన ప్రయత్నాలను కొనసాగిస్తూ స్థానిక స్టీల్ యాజమాన్యం వైఖరి మార్చుకునేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలన్నారు. నాయకులు బి.అప్పారావు, టి.వి.కె. రాజు, మధుసూదన్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

అగనంపూడి: తెలుగు జాతికి, భాషా ఔన్నత్యానికి గుర్తింపు తీసుకువచ్చిన శ్రీకృష్ణదేవరాయల కీర్తిని నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని రాష్ట్ర కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నవానిపాలెంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ముందు వరుసలో ఉంటారన్నారు. స్థానికంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామాభివృద్ధి కమిటీని వారు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా నాయకురాలు గొన్నా రమాదేవి, అఖిలపక్షాల నాయకులు గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, పాముల వసంతరావు, కరణం కళావతి, దాసరి వెంకట జయలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుమ్మల శ్రీను, ఇల్లపు శ్రీను, నరేంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లబ్ధిదారుకు గ్యాస్ పొయ్యి అందజేస్తున్న ఎంపీ జీవీఎల్

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో భాగంగా పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జీలకర్ర రమణ, జీలకర్ర భువనేశ్వరి, కిల్లాన ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామాలయ పరస



ప్రత్యేక అలంకరణలో సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు



ఆలయం ఎదుట గరిడీ నిర్వహిస్తున్న బృందం



పెంటమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు రెడ్డితుంగ్లాంలో కోదండ రామాలయ పరస మహోత్సవం కన్నులపండువగా జరిగింది. బుధవారం ఉదయం నుంచి ఆలయం వద్ద సందడి నెలకొంది. గ్రామస్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని సీతా, లక్ష్మణ సమేత కోదండరాముడికి పూజలు చేశారు. సాయంత్రం జరిగిన పరస మహోత్సవంలో విద్యుద్దీపకాంతులు మిరుమిట్లు గొలిపాయి. గరిడీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా పెంటమాంబ పరస

పెదగంట్యాడ: గ్రామదేవతల పండగలు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నెల్లిముక్కు గ్రామంలో కొలువు దీరిన పెంటమాంబ అమ్మవారి పరసను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను చల్లగా చూసే గ్రామదేవతల పండగలను ఏటేటా చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పెంటమాంబ ఆలయ ప్రాంగణంలో భూలోకరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆకట్టుకున్న కోలాటం

పరసలో నెల్లిముక్కు రామాలయం కోలాటం బృందం కోలాటం, బుర్రకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని నెల్లిముక్కు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పులి రాజారెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గొందేశి సుమన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం ఎదుట కోలాటం



స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి

అప్పన్న ఆలయంలో ‘స్వచ్ఛ తీర్థ’



ఆస్థాన మండపాన్ని శుభ్రం చేయిస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక గురువు భారత్



బ్రహ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

అల్లిపురం : ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తుందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్థాపించిన బ్రహ్మ బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం సందర్భంగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మకుమారీ బోధనల ద్వారా విముక్తి కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశంలో యోగాకి విస్తృత ప్రాచుర్యం కల్పించారన్నారు. సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంకాలం బీచ్ రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద అమరజ్యోతి బుర్ర కథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా అద్భుత పావన జీవిత చరిత్ర విని, చూసి తరించాలని కోరారు. బ్రహ్మ పోస్టర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్రరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.